


# మేరా భారత్ మహాన్!

కె.వి.యస్.వర్మ

"ఎవరు నువ్వు? నీ సమస్యేమిటి"

"నాథా, నేనూ, తమ శకుంతలను"

"పరాయి స్త్రీ అలా సంబోధించడం చాలా తప్పు. నువ్వెవరివో నాకు తెలియదు. నీ పేరు కూడా ఇప్పుడు నువ్వు చెబితేనే తెలిసింది"

"మీరలా అనడం భావ్యం కాదు ప్రభూ. నన్ను గాంధర్వ వివాహం చేసుకున్నారు..."

"ఏమిటీ నీ మతిలేని మాటలు! నా సతిని అని చెప్పడానికి ఏదీ సాక్ష్యం"

"పంచభూతాల సాక్షిగా నన్ను వివాహం చేసుకున్నారు కదా. అవే సాక్షులు. అంతకంటే ఏం కావాలి నాథా"

"అదిగో మళ్లీ ఆ పిలుపు! నువ్వు నా భార్యవని రుజువయితే తప్ప నేను నీకు నాథుణ్ణీ, నువ్వు నాకు సతివీ కాలేం. ముందు నువ్వా సంగతి గుర్తుంచుకో"

"నన్ను చూసిన మరుక్షణంలోనే నా మీద ప్రేమో, వ్యామోహమో ఇంకేదో కలిగి మీరు నన్ను వివాహం చేసుకున్నారు. మీరు వేటకు వచ్చినప్పుడు ఆ అడవిలో..."

"నేనీమధ్య వేటకు రాలేదే!"

"ఈ మధ్య అంటే, కొంతకాలం కిందట మీరు వేటకు వచ్చినప్పుడు నన్ను పెళ్లాడటమే కాకుండా..."

"చెప్పేదేదో సూటిగా చెప్పు..."

"మనం..."

"ఇన్ని మాటలు నేర్చిన దానివి, నీకు సిగ్గు కూడానా!"

"మనం ఒకటయ్యాం మహారాజా"

"మహారాజా, ఈమె వరస చూస్తుంటే తను మహారాణి అవుదామనే దురాశతో ఇన్ని అబద్ధాలు ఆడుతున్నట్టుంది. ఇంకా ఈమెను ఈ నిండు కొలువులో వుండనిస్తే ఇంకెన్ని అసత్యాలు చెబుతుందో. సభ నుంచి పంపించెయ్యమందురా, కారాగార శిక్ష విధించమందురా ప్రభూ"

"మంత్రివర్యా, శాంతం శాంతం. శకుంతలా, నిన్ను నేను వివాహమాడి వుంటే, నీకేమన్నా నా గుర్తుగా ఉంగరమేదన్నా ఇచ్చానా..."

"ఇచ్చారు ప్రభూ ఇచ్చారు..."

"అయితే, ఏదీ, చూపించు"

"ఇదిగో మహారాజా... అయ్యో, వేలికున్న ఉంగరమేదీ? దారిలో ఎక్కడ జారిపడిపోయిందో!"

"చూశారా మహారాజా, మళ్లీ అబద్ధమాడింది. మీరింకా సహనం చూపిస్తే అబద్ధాల మీద అబద్ధాలు ఇంకెన్ని ఆడుతుందో. శకుంతలా ఇప్పటికే నువ్వు మా ప్రభువుల విలువైన సమయాన్నెంతో వృధా చేశావు. నువ్వింక దయచెయ్యి..."

"మంత్రీ, ప్రజల కష్టసుఖాలు తెలుసుకోవడం మన విధి. శకుంతలా నీ మాటలు మేం విశ్వసించడం లేదు. నీ దురాశాపూరిత పలుకుల్ని క్షమిస్తున్నాం. నువ్వింక వెళ్లొచ్చు"

"అన్యాయం ప్రభూ. చాలా అన్యాయం. స్త్రీని, అందునా మునికన్యను- మీరు నా భర్త కాకపోతే నాథా అని పిలువగలనా? మీ పొందు ఫలం నా కడుపులో పెరుగుతోంది. నన్ను నమ్మండి"

"మహారాజా, ఈమె మళ్లీ ఇంకో అసత్యమాడింది. ఇంక ఊరుకుంటే లాభం లేదు..."

"కోపగించకండి మంత్రీ. శకుంతలా, సాక్ష్యం చూపలేకపోయావు. అంచేత నిన్ను మేం నమ్మడం లేదు. ఇంక ఒక్క మాటకూడా నేను వినదలుచుకోలేదు. వేగిరం వెళ్లిపో. లేకపోతే నీకు మర్యాద దక్కదు"

దుష్యంత మహారాజు విసుగ్గా సభ చాలించి తన భవనానికి వెళ్లిపోయాడు.

శకుంతల అవమానభారంతో కన్నీళ్లు కారుస్తూ అడవిలోని తన ఆశ్రమానికి తిరుగు ప్రయాణమయింది.

*** *** ***

"నీ కంప్లయింటేవిటో చెప్పు"

"నన్ను..."

"నిన్ను ఎవరన్నా తిట్టేరా? కొట్టేరా"

"కాదు, నన్ను..."

"ఏంటలా నీళ్ల నములుతున్నావ్. నీ డబ్బూ దస్కం ఎవరన్నా దోచుకున్నారా? అలాంటివేమీ నీ దగ్గరుండే అవకాశం లేదు. చూస్తుంటే పేద్దానివిలాగున్నావ్. నీ సమస్యేమిటో త్వరగా చెప్పు. నాకు బోలెడన్ని పనులున్నాయి"

"నన్ను ... కేసవరావు దొర బలవంతం సేసిండు"

"ఏంటీ, కేశవరావు దొరా! మీ పేదోళ్లకు ఇదో అలవాటయిపోయింది. కేశవరావు దొరగారేంటీ, నిన్ను రేప్ చేయడమేంటీ! దొంగ వేషాలేస్తున్నావా ముండకానా"

"నిజం దొరా, ఆయనే మొన్నగాక అటు మొన్న రాత్రి నన్ను బలాత్కారం సేసిండు"

"అటు మొన్నరాత్రా! కేశవరావు దొరా! అబద్ధాలాడకు. మొన్న ఆయన ఈ ఊళ్లోనే లేరు..."

"ఉన్నాడు దొరా, వున్నాడు. అటుమొన్న రాత్రే ఆయన పొలం దగ్గరున్న సావిడిలో నన్ను పాడుసేసేడు"

"కేశవరావు దొర ఊళ్లోనే లేరంటే, నిన్ను పాడుచేశాడంటావ్! నీ మాటలు నమ్ముమంటావ్. సాక్ష్యం వుందా? సరే, నువ్వన్నట్టే నిన్ను రేప్ చేశాడనుకుందాం. ఎలా చేశాడో చెప్పమ్మా చెప్పు"

"ఎలాగంటే... నన్ను పట్టుకుని..."

"నిన్ను పట్టుకుని..."

"సావిడిలోకి లాక్కుపోయాడు. నేన లాంటిదాన్నికాను, ఒగ్గేయమన్నాను. ఇన లేదు. బలవంతం సేసేడు..."

"అదే, ఎలా చేశాడో చెప్పు. నమ్మదగిందిగా వుంటే, కేసు బుక్ చేస్తాను"

"నన్ను సావిడిలోకి లాక్కుపోయి, నేను వద్దంటూ గింజుకున్నా ఇనకుండా..."

"నిన్ను అనుభవించాడంటావ్. వివరంగా చెప్పమంటే చెప్పవు. ఇక్కడే చెప్పలేకపోతే, రేపు కోర్టులో అంతమంది ముందు ఎలా చెప్పగలవు? ఆయన నిన్ను అనుభవిస్తుంటే నీకూ సైతగానే వుండి వుంటుంది. నువ్వూ ఆయన్ని అనుభవించే వుంటావ్. అవునా"

"అన్నేయం మాటలనకు దొరా. నా తల్లి మీదొట్టు. కేసవరావు దొర నన్ను ఎంతగానో హింసపెట్టేడు. కేసు రాసుకో"

"దొంగముండకానా. ఇంకొక్క మాట మాట్లాడావంటే ఈ స్టేషన్లోనే రేప్ అయిపోగలవు జాగ్రత్త. గెటవుట్. కేసూ లేదు గీసూ లేదు. ఇంటికెళ్లిపోయి, నోరు మూసుకొని ఎప్పటిలాగే పనీ పాటా చేసుకుంటూ బతుకు. కేశవరావు దొర మీద కేసెడితే ఆ బతుకు కూడా వుండదు. బుగ్గయిపోతావ్. ఆయన నిన్ను రేప్ చేసినా ఆరోజున తను ఇంకేదో ఊళ్లో వున్నట్టు సాక్ష్యం చూపించగలడు. అది గుర్తు పెట్టుకో. హాయిగా సెక్స్ అనుభవించేసి, ఆ తర్వాత రేపూ గీపూ అంటూ

కంప్లయింట్ చేయడం నీలాంటోళ్లకు బాగా అలవాటయిపోయింది..." అన్నాడు వెటకారంగా నవ్వుతూ ఎస్.ఐ.

"ఛూ..." ఎర్రబడిన కళ్లతో ఇంటి దారి పట్టింది సంతోషి.

***   ***   ***

చీకటి వెలుగును మింగుతోంది. గాలి చీదర చీదరగా వీస్తోంది చెట్ల ఆకులు వణుకుతూ విలవిలలాడుతున్నాయి.

పొలం పనిలో మట్టికొట్టుకుపోయిన కాళ్లూ చేతులూ కడుక్కుని ఇంటికి బయలుదేరింది సంతోషి.

తాటాకు సావిడి అరుగుమీద కూర్చున్న కేశవరావుకు ఆ చీకటిలో కాంతిరేఖ కనిపించింది. గబుక్కున అరుగుమీంచి దిగి, గబగబా ముందుకెళ్లి కాంతిరేఖను పట్టుకున్నాడు. సంతోషి అతని చేతుల్ని విడిపించుకోబోయింది.

"ఎవరూ" అంది పెనుగులాడుతూ భయం భయంగా.

"నేనే సంతోషీ, నీ దొరను" అన్నాడు కీచు గొంతుతో కేశవరావు.

నల్లగా దున్నపోతులా వున్న కేశవరావు చీకటిలో కలిసిపోయాడు. ఆమెను సావిడిలోకి లాక్కుపోయాడు.

చీకటి చేతుల్లో చిక్కుకుపోయిన తెల్లని సంతోషి మెరుపులా మెలికలు తిరుగుతోంది. చీకటి చేతులు అంతకంతకూ గట్టిపడుతూ ఆమెను మరింత గట్టిగా కౌగలించుకున్నాయి.

సంతోషి గట్టిగా అరిచింది.

"ఏంటే, లం...ముండా గీరలు పోతున్నావ్.నాలాంటి దొర నిన్ను ముట్టుకోడమే నీకు గొప్ప. నువ్వెంత అరిచినా నా సావిడిలో కెవడూ రాలేదు. నువ్వెంత గింజుకున్నా నేను నిన్ను విడిచిపెట్టను. నువ్వు పెద్దమనిషివైనప్పటినుంచీ నీ అందం చూస్తున్నాను. నువ్వు బంగారం బొమ్మలాగుంటావు తెలుసా" అంటూ ఏవేవో వాగుతూ సంతోషి పెదాల్ని ముద్దుపెట్టుకున్నాడు.

సంతోషి అతన్ని తోసెయ్యబోయింది. కేశవరావు కొండచిలువలా ఆమెను చుట్టుకుపోయాడు. నిమిషనిమిషానికీ అతను అగ్నిజ్వాలలా మారిపోతున్నాడు. సంతోషి మంచు ముద్దలాగయిపోతోంది. భయంతో, అసహ్యంతో నరాలు బిగదీసుకుపోయాయి. కండరాలు కుంచించుకుపోయాయి. కుంచించుకుపోయిన కండరాల్ని కత్తితో కోస్తున్నట్టు మంట. మంచు ముద్ద శరీరం కరుగుతున్నట్టుగా చెమట్ల ధార. పుండుమీద కారం చల్లినట్టుగా భరించలేని బాధ. పరమ అసహ్యంతో సంతోషి ఒళ్లంతా ముడుచుకుపోయింది. చెవలపిల్లిని చటుక్కున పట్టుకుని గుటుక్కున మింగిన కొండ చిలువలా కేశవరావు...

చీకటి మరింత చిక్కబడింది. కేశవరావు రాక్షసానందంతో, ఒగురుస్తూ ఆమెను వదిలి "ఇంకెళ్లు" అన్నాడు.

సంతోషి ఏడుస్తూ నెమ్మదిగా అడుగులేస్తూ ఇంటికెళ్లింది. గుడిసె అరుగుమీద కుప్పకూలిపోయింది.

"ఏంటే, ఇంతాలీసం అయిపోనాది" అంటూ తల్లి బయటకొచ్చి,కూతుర్ని చూసి,

"ఏంటమ్మా, ఏవయ్యిందే తల్లీ" అంటూ కూతురి నుదుటమీద చెయ్యేసి చూసింది.

ఒళ్లు కాలిపోతోంది.

"జొరం ఎప్పుడొచ్చిందే! ఒంట్లో బాగోపోతే బేగా వచ్చేపోయావా" అంటూ లోపలికెళ్లి, గుడ్డముక్కను నీళ్లతో తడిపి, అరుగుమీదకొచ్చి, కూతురి పక్కన కూర్చుంది లచ్చమ్మ.

సంతోషి అలా పడుకునే వుండిపోయింది. కూతురి నుదుటమీద తడిగుడ్డ వుంచింది. కాసేపటికి సంతోషిలో కదలిక వచ్చింది. వెక్కి వెక్కి ఏడుస్తూ, గోడకానుకుని కూర్చుంది.

"ఏంటే సంతోసీ మరీ అలా ఏడుత్తున్నావ్! జొరమే కదా. ఈరేత్తిరికి లంకణం సేస్తే పొద్దుటికదే తగ్గిపోతాది. తగ్గకపోతే జొరం బిళ్లవేసుకుందివిగానిలే" అంది లచ్చమ్మ.

తల్లి సముదాయిస్తుంటే సంతోషికి దుఃఖం మరింత ఎక్కువయింది.

లచ్చమ్మ తెల్లబోతూ, కూతురికి దగ్గరగా జరిగి,భుజంమీద చెయ్యేసింది.

"అబ్బా" అంది బాధగా సంతోషి.

"ఏంటే,ఇక్కడేమన్నా దెబ్బతగిలిందా"

"......"

చీకటి చేతుల్లో చిక్కుకుపోయిన తెల్లని సంతోషి మెరుపులా మెలికలు తిరుగుతోంది. చీకటి చేతులు అంతకంతకూ గట్టిపడుతూ ఆమెను మరింత గట్టిగా కౌగలించుకున్నాయి



"ఏంటే మాటాడవ్" అంది లచ్చమ్మ.

ఆ గుడిసెలోని కిరసనాయిలు దీపం వెలుగు అతి కొద్దిగా అరుగుమీద, అదీ గుమ్మం ముందు కాస్త మేర మాత్రం పడుతోంది.

"సలేస్తాంది. లోపలికి పోదం నడు" అంటూ కూతుర్ని లేపి తీసుకెళ్లింది లచ్చమ్మ.

నులకమంచం మీద పడుకుంటూ "అబ్బా" అంటూ మూలిగింది సంతోషి.

దీపం వెలుగులో-చిట్లిన కూతురి పెదవినీ, చేతుల మీదా, భుజం మీదా కంఠం పక్కన గోళ్ల రక్కుళ్లీ, అక్కడ గడ్డ కట్టిన రక్తాన్నీ చూసి, అనుమానంతో, భయంతో, "ఏంటే ఇవీ, ఏం జరిగిందే తల్లీ" అని వణుకుతున్న గొంతుతో అడిగింది లచ్చమ్మ.

సంతోషి మళ్లీ భోరున ఏడ్చింది.

దూరం నుంచి కుక్కల అరుపులు వినిపిస్తున్నాయి. తలుపు సందులోంచి చలిగాలి సన్నగా వస్తోంది. ఆ గాలి తగిలినప్పుడల్లా దీపం రెపరెపలాడుతోంది.

లచ్చమ్మ మనసు కీడెంచి, మళ్లీ 'ఏమీ అయ్యుండదులే' అని సరిపెట్టుకుంది. కూతురిని అలా ఏడవనిచ్చింది. కొంత సేపటికి సంతోషి ఏడుపు ఆపింది.

"అమ్మా"

"ఏంటమ్మా"

"మనూరి కేసవరావు దొర..." అంటూ జరిగిందంతా తల్లికి పూసగుచ్చినట్టు చెప్పింది సంతోషి.

"అమ్మా తల్లీ, ఎంత గోరం జరిగిపోనాదే" అంటూ లచ్చమ్మ ఏడవడం మొదలెట్టింది.

"ఎంత పని సేసేవు దేవుడా! నీకు మేమేం అన్నేయం సేసేవని మాకింత అన్నేయం సేసేవు" అంటూ గుండెలు బాదుకుంది.

అంతలోనే, 'పక్కింటివాళ్లకు తన మాటలూ ఏడుపూ వినిపిస్తాయేమో' అనుకుంది. అలా అనుకోగానే మరో అనుమానం వచ్చింది.

"ఏమ్మా సంతోసీ, ఆ దుర్మార్గుడు నీ మీద అగాయిత్యం సేసినప్పుడు ఎవరన్నా సూసేరేంటే"

"నేదు"

"పోన్లే తల్లీ, కొంతలో కొంత నయం. నువ్వూ ఈ సంగతి ఎవరికీ సెప్పకు" అంది లచ్చమ్మ.

సంతోషి మళ్లీ ఏడ్చింది.

"ఏడవకమ్మా. నీకెప్పుడూ సెప్పనేదు కానీ, నువ్వు పుట్టినప్పుడు నీ అందం సూసి నేనెంతగా ఏడ్చేనో నీకు తెలీదు. మీ అయ్యకు తెలుసు. 'బంగారం లాంటి పాప పుడితే ఎందుకే ఏడుత్తావ్ 'అన్నాడు మీ అయ్య. అచ్చు, నీ పోలికేనయ్యా నీ కూతురు. మనలాంటి అంటరాని కులాల్లో మొగాళ్లు నీలాగ అందంగా పుడితే పర్వానేదు. నా మొగుడు ఎంతందగాడో ననుకుంటూ నాలా మురిసి పోతారు. నాను అందంగా లేకపోవడమే నా అదురుస్టం. మనలో ఆడది అందంగా వుంటే వయసొచ్చినప్పటి నుంచీ దినదినగండమే. మనువు కాక మునుపూ, అయ్యేక కూడా దొరలందరి కళ్లూ అలాంటి ఆడాళ్లమీదే. నయానో బయానో లొంగదీసుకోకుండా వుండరు' అని నానన్నాను. 'నువ్వన్నది నిజమే కానీ, ఎప్పుడూ కాలం ఇట్టాగే వుండదులే. రోజులు మారుతున్నాయి. మనకూ మంచి రోజులు వత్తాయి' అన్నాడు మీ అయ్య. సచ్చిపోయి మీ అయ్య ఎక్కడున్నాడో కానీ, ఆడు కోరుకున్న రోజులు ఇప్పటికీ రానేదు" అంది లచ్చమ్మ కన్నీళ్లను చీర చెంగుతో తుడుచుకుంటూ.

"అమ్మా, అయ్య అనుకున్నంత కాకపోయినా, రోజులు మారాయి. రేపు కేసవరావు దొరమీద పోలీసు కేసు ఎడతాను"

"నీకేమన్నా మతి పోయిందేటే. అలా సేసేవంటే దొర మనల్ని బతకనిత్తాడా? ఊళ్లో తాగడానికి మంచినీళ్లు కూడా దొరకనివ్వడు. ఆ ఇసయం తెలుసుకాబట్టే, నీకంటే ముందు నలుగురైదుగుర్ని పాడుసేసినా ఆళ్లు నోరు మూసుకుని వుండిపోనారు. అలాంటి పిచ్చి పని సెయ్యకు"

"ఇంతకుముందు బలాత్కారానికి గురయిన వాళ్లల్లో ఒక్కరైనా ఆదొరగాడి మీద పోలీసు కేసు పెట్టి వుంటే, ఆడికి సిచ్చ పడి వుండేది. నాకిప్పుడీ కస్టం వచ్చి వుండేది కాదు. అందుకే కేసెడతాను. అలా సేస్తే, రేపు నాలా మరో ఆడది అన్నేయం అయిపోకుండా వుంటాది" అంది సంతోషి నెమ్మదిగానే అయినా దృఢంగా.

కేశవరావు దొర ఎంత దుర్మార్గుడో, ఎప్పుడెప్పుడు ఎలాంటి అన్యాయాలు చేశాడో లచ్చమ్మ ఆ రాత్రి కూతురికి వివరంగా చెప్పింది.అయినా సంతోషి భయపడలేదు.

సంతోషి తను అనుకున్నట్టుగా తెల్లవారేక పక్క ఊళ్లోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లలేకపోయింది, జ్వరం తగ్గకపోవడంతో. ఆ తర్వాతి రోజు జ్వరం తగ్గేక, తల్లి పోరు పడలేక వేణ్ణీళ్ల స్నానం చేసింది. ఎలాగో తల్లి కళ్లు కప్పి పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది.

***   ***   ***

"తండ్రీ, దుష్యంత మహారాజు ఇంత దుష్టుడని అనుకోలేదు"

"నీ విషయంలో మనం అలా అనుకోవడంలో తప్పులేదు. అయితే, ఇంతకు ముందెప్పుడూ ఆయన గురించి ఏ చెడూ వినలేదమ్మా శకుంతలా"

"ఏమో ఏం చెప్పగలం. నాకు జరిగిన అన్యాయం ఇతరులకు తెలియదుగదా. అలాగే ఇతరులకేమన్నా జరిగుంటే అది మనకు తెలియకపోవచ్చు"

"నువ్వున్న ఈ పరిస్థితిలో నీకలాగే అనిపిస్తుంది తల్లీ"

"ఎంత అన్యాయం తండ్రీ! పంచభూతాల సాక్షిగా నన్ను గాంధర్వ వివాహం చేసుకుని, నా పొందుకోరి, నాతో సుఖించి, నన్ను తల్లిని చేసి, ఇప్పుడు ఏమీ ఎరుగనంటూ అబద్ధమాడాడు. పైగా సత్యం చెప్పిన నన్ను అబద్ధాలకోరువన్నాడు. ఇంతకంటే దుర్మార్గం వుంటుందా తండ్రీ"

"ఆవేశపడకమ్మా. ఎంతటి వారైనా ఒకోసారి శాపవశాత్తూ అలా ప్రవర్తించక తప్పదు. శాపవిముక్తి కలిగేక అంతా మంచే జరుగుతుంది"

"ఇంకేం మంచి తండ్రీ. శాపగ్రస్తుడు అతడు కాదు, నేను. విశ్వామిత్ర మహర్షి తపస్సును భగ్నం చెయ్యమని పంపితే, మేనక ఈ అరణ్యానికి వచ్చింది. విశ్వామిత్రుని ఆకర్షించి, అతని మనసు చెదిరేలా చేసి, స్వర్గ సుఖాలను ఇక్కడే అందించింది. గర్భం ధరించి, నన్ను కని, ఈ అడవి తల్లికి వదిలేసి పోయింది. వాళ్లు నా తల్లిదండ్రులు! అనాధనైన నన్ను నువ్వు కరుణించి చేరదీసి, పెంచి పెద్దదాన్ని చేశావు. పుట్టినప్పటినుంచీ తల్లినయ్యేదాకా నేను శాపగ్రస్తురాలినే కదా తండ్రీ. నా తల్లి మేనకలా నేనూ నా కుమారుడు భరతుడికి తల్లి లేకుండా చెయ్యలేకపోయాను. అందుకే గుండెల్లో కొండంత బాధనూ, అవమానభారాన్నీ భరిస్తూ బతుకుతున్నాను"

"ఓపిక పట్టు తల్లీ. బతుకు బతకడానికేనని గ్రహించావు. ఎన్నెన్ని కష్టాలొచ్చినా వాటిని ఎదుర్కొని బతకడమే మనుషుల కర్తవ్యం. కష్టాలు కలకాలం వుండవు. నా మాట నమ్ము" అని కణ్వ మహర్షి ఆశ్రమంలోకి వెళ్లాడు.

శకుంతల నిట్టూర్చింది. నదిలో పడిపోయిన తన ఉంగరం ఓ చేప మింగిందనీ, ఆ చేప ఓ జాలరికి దొరుకుతుందనీ, చేప కడుపులోని ఉంగరం దుష్యంత మహరాజుకు చేరుతుందనీ, దాన్ని చూడగానే అతనికి అంతా జ్ఞాపకమొస్తుందనీ శకుంతలకప్పుడు తెలియదు.

"భరతకుమారా, భోజనానికి సమయమయ్యింది. పులీ ఎలుగుబంట్లతో నీ ఆటలిక చాలించి రా" అని విసుగ్గా కొడుకుని పిలిచింది.

తన కుమారుడు భరతుడే ఈ రాజ్యాన్ని పాలిస్తాడనీ, అతని పేరుమీదే ఆ తర్వాత ఈ దేశం కొనసాగుతుందనీ శకుంతలకు ఆ క్షణంలో ఏమాత్రం తెలియదు.

*** *** ***

"లచ్చమ్మా, ఇయిగో, దొరగారంపినారు" అన్నాడు కేశవరావు పాలికాపు భుజం మీంచి ధాన్యం బస్తా గుడిసె అరుగుమీద పడేస్తూ.

"ఎందుకు? మాకేమీ ఆయన బకాయిపడనేదే!" అంది లచ్చమ్మ ఆశ్చర్యంగా.

"అయ్యే కాదు, ఈ వందాకూడా ఇమ్మన్నాడు. మా దొరది మా దొడ్డ మనసు" అంటూ లచ్చమ్మ చేతిలో పెట్టాడు.

నెమ్మదిగా కట్టెల మంట ఎగసింది. సంతోషి మొహం ఆ మంట వెలుగులో మరింత ఎర్రగా కనిపించింది. ఆమె గుండెలు రగిలిపోతున్నాయి. ఆమె దవడ, కండరాలు బిగుసుకున్నట్టుగా ఎత్తుగా కనిపించింది. కూతుర్ని చూస్తున్న లచ్చమ్మ "సంతోసీ, జరిగిందాన్ని మరిచిపోమని సెప్పేను కదా. జరిగిందాన్ని తలుచుకుంటూ కూర్చోకు" అంది



"వద్దొద్దు" అంది లచ్చమ్మ కంగారుగా.

"వుంచొంచు. నీ కూతురు నిన్న పోలీస్‌స్టేషన్ కెళ్లిందటగా. మొదట్లో దొరకు మా సెడ్డ కోపమొచ్చింది. తర్వాత, శాంతపడి, 'పోన్లే, పిచ్చిపిల్ల మన గురించి తెలీక ఎల్లింది. ఇంక బుద్దిగా వుండమని సెప్పు' అని హెచ్చరించి ఇయ్యన్నీ నాసేత పంపాడు" అని పాలికాపు ఇంకక్కడ ఒక్క నిమిషం కూడా ఉండకుండా వెళ్లిపోయాడు.

లచ్చమ్మ నిశ్చేష్టురాలై నిలబడిపోయింది కొద్ది క్షణాలపాటు.

"ఏంటే అమ్మా" అంటూ సంతోషి ఇంట్లోంచి బయటికొచ్చి, అరుగుమీదున్న ధాన్యం బస్తానూ, తల్లి చేతిలో వున్న వంద రూపాయల కాగితాన్నీ చూసింది.

లచ్చమ్మ ఉలిక్కిపడి, 'సెబుతాను లోపలికి పద' అంటూ గబగబా నడిచింది.

తల్లి చెప్పింది విన్నాక సంతోషికి ఒళ్లు మండిపోయింది.

"ఎందుకు తీసుకున్నావే అమ్మా. ఆ నం...కొడుకు అయన్నీ పంపడమూ, మనం తీసుకోడమూనా? సిగ్గునేదూ. ఛీఛీ..."

"అయి తీసుకోడం నాకూ యిస్టం నేదు. కానీ తీసుకోక తప్పదు. వద్దన్నామంటే నీకింకా ఆడిమీద కోపం పోలేదనుకుంటాడు. మనల్ని, మన గుడిసెనూ నాశనం చేస్తాడు. అయి తీసుకున్నామనుకో నువ్వు సల్లబడిపోయావనుకుంటాడు. దాంతో ఆడింక మన జోలికి రాడు. అనుబవం మీద సెబుతున్నాను. నువ్వే మీ గొడవ సెయ్యకు" అని లచ్చమ్మ వంట చెయ్యడానికి పొయ్యిలో కట్టెలు వెలిగించింది.

నెమ్మదిగా కట్టెల మంట ఎగసింది. సంతోషి మొహం ఆ మంట వెలుగులో మరింత ఎర్రగా కనిపించింది. ఆమె గుండెలు రగిలిపోతున్నాయి. ఆమె దవడ, కండరాలు బిగుసుకున్నట్టుగా ఎత్తుగా కనిపించింది. కూతుర్ని చూస్తున్న లచ్చమ్మ "సంతోసీ, జరిగిందాన్ని మరిచిపోమని సెప్పేను కదా. జరిగిందాన్ని తలుచుకుంటూ కూర్చోకు" అంది.

ఇంక తల్లితో ఏం చెప్పీ ప్రయోజనం లేదని సంతోషి అనుకుంది.

ప్రతిరోజూ తెల్లవారుతోంది. రాత్రవుతోంది. సంతోషి పనిలోకెళ్తోంది. పగలంతా కష్టపడడంతో ఇంటికొచ్చి భోంచేశాక నిద్రపోతోంది.

ఎప్పుడో మెలకువ వస్తుంది. కేశవరావు గుర్తుకొస్తాడు. వాడిమీద, తన ఒంటిమీద, తన చేతకానితనం మీద అసహ్యం వేస్తుంది.

తప్పు చేసినవాడు దేవుడయినాసరే శిక్ష పడితీరాలి అనుకుంటుంది.

ఈసారి తనకు తనే ఆ దున్నపోతుమీద ప్రేమ వున్నట్టు నటించి, వాడు కామంతో కళ్లు మూసుకుపోయి తనమీద పడేటప్పుడు బొడ్డులోంచి చాకు తీసి అదేదో సినిమాలోలాగ పొడిచేస్తేనో? అనుకుంటుంది. మళ్లీ అంతలోనే థూ... వాడిమీద దొంగభిమానం చూపడం కూడా సిగ్గుచేటే అనుకుంటుంది.

రోజులు కొందరిలాగే లేదా చాలామందిలాగే సంతోషికీ ఎంతో భారంగా గడిచాయి. ఒకటి కాదు, రెండు కాదు, తొంభైరోజులు. అప్పటికే ఆమెకున్న అనుమానం ఆరోజున తీరిపోయింది. మొదట తన కడుపుమీద కోపం, అసహ్యం కలిగాయి.

అంతకుముందు ఓ రోజున ఒక మహిళా సంఘం సభ్యురాలు తమ ఊరు వచ్చినప్పటి సంగతి సంతోషికి గుర్తుకొచ్చింది. తన గురించనికాకుండా ఎవరిపైనన్నా ఎవడన్నా అత్యాచారం చేస్తే పోలీసులు కేసు నమోదు చేసుకోపోతే ఏం సెయ్యాలి అని అడిగింది తను.

అత్యాచారం జరిగేక స్నానం చెయ్యకుండా, ముఖ్యంగా ఇంద్రియాన్ని శుభ్రం చెయ్యకుండా వుండాలందామె. అత్యాచారం జరిగినట్టు డాక్టర్ సర్టిఫికెట్ కావాలంది.

'అవేవీ లేకపోతేనో' అని తను అడిగింది.

ఆ సాక్ష్యం లేకపోతే ఏం చెయ్యలేమంది ఆ సభ్యురాలు.

పోలీస్ స్టేషన్లో సబ్ ఇన్‌స్పెక్టరూ సాక్ష్యం వుండాలన్నాడు. ఆవిడా సాక్ష్యం వుండాలంది.

అయ్యో, అవి లేవే అని తనప్పుడు ఎంతో బాధపడింది...

ఇప్పుడు తను తల్లి కాబోతోంది. తనకు పుట్టబోయే బిడ్డ రక్తమూ, ఆ దొర రక్తమూ ఒకటే అవుతాయి కదా. తన బిడ్డ రక్తం సాక్ష్యం చెబుతుంది కదా!

సంతోషికి ఆ ఆలోచన రాగానే సంతోషం పట్టలేకపోయింది. తల్లికి చెబుదామనుకుంది. తల్లేం చెబుతుందో తనకు తెలుసు కదా అనుకుంది.

"సంతోసీ, నీకు కడుపు వచ్చిందని తెలిస్తే మన సుట్టుపక్కలోళ్లు ఎన్నో సూటీపోటీ మాటలు ఆడతారు. మనూళ్లోనే మనం తలెత్తుకోలేం. అంచేత కడుపు తీయించేసుకో" అంటుంది.

తల్లి అలాగంటే అది ఆమె తప్పుకాదు. ఇరుగూ పొరుగూ నిస్సందేహంగా అలాగే వుంటుంది.

తనకొచ్చిన ఆలోచన సెబితే తల్లి గుండెలు బాదుకుంటుంది. 'నిన్నేకాదు, నన్నూ దొర బతకనివ్వడు"అని అంటుంది.

అవును. అదీ నిజమే.

మరి ఏం చెయ్యాలి?

సంతోషి అలా ఆలోచిస్తూనే వుంది.

ఇక్కడుంటే తనకే కాదు, తన తల్లికీ ప్రమాదమే. కేసవరావు దొరకు శానా పలుకుబడివున్నాది. మరో ఊరు వెళ్లినా సుట్టుపక్కల వాళ్లనుంచి ప్రశ్నలూ, ఎగతాళులూ ఎదుర్కోక తప్పదు.

మరేం సెయ్యాలి?

తను బిడ్డను కని తీరాలి. తన బిడ్డ రక్తంతో, తనను గాయపర్చి హింసించిన వాడి రక్తమూ ఒకటేనని రుజువు సెయ్యాలి. అంటే సాక్ష్యం చూపించాలి. అలాగ ఆ నీచాతి నీచుడైన దొరకు శిక్ష పడేలా చేయాలి. అలా సెయ్యాలంటే...

ఆ దొరగాడికి బయ్యింపడే ఇలాంటి మనుసుల మద్దిన ఉండే కంటే ,ఆ దొర బయ్యింపడేవాళ్లున్న అడవిలోకి పోయి బిడ్డను కనడమే మంచిది! తనలా అన్నేయం అయిపోయేవాళ్లను వాళ్లు తప్పకుండా ఆదుకుంటారు.

అంతేనా?

అంతే అనుకుంది సంతోషి.

తనకు పుట్టే బిడ్డ దుష్టుడైన తండ్రికి శిక్షపడేలా చేయడానికి ఉపయోగిస్తాడని సంతోషికి ఆ సమయంలో చాలా బాగా తెలుసు.

●